
త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయ పూజల్లో పాల్గొన్న భక్తులు


రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న కె.కె.రాజు


పార్వతీశ్వరాలయంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు


నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న కె.కె.రాజు

శంభో శంకర

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలోని శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి శంభో శంకరుడి దర్శనం కోసం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, జల, పంచామృతా, రుద్రాభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జాగరణ రాత్రిలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.


బాపూజీనగర్ కోదండ విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


సీతంపేటలో పార్వతీశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు


లలితా పీఠంలో అఘోర పాశుపత హోమం


51వ వార్డులో పూజలందుకున్న శివయ్య

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట గణేష్ నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ స్వామికి పంచామృతాభిషేకం, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కుటుంబ సమేతంగా పార్వతీశ్వరుడిని దర్శించుకున్నారు. లింగోద్భవకాలంలో శివలింగానికి బియ్యంతో అభిషేకించారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ శంకరమఠం రోడ్ రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో స్వామిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, ఆలయ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌తో కలిసి దర్శించి పూజలు చేశారు. అక్కయ్యపాలెంలోని జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరుల ఆలయం, శంకరమఠంలో విశేష పూజలు నిర్వహించారు. లింగోద్భవకాలంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సాయంత్రం ఆలయాలను సందర్శించి ధ్వజస్తంభం వద్ద దీపారాధనలు జరిపారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ లలితానగర్ లలితా పీఠంలో లలితా అమ్మవారికి తెల్లవారు 5 గంటలకు పంచామృతాభిషేకం, మణిద్వీపంలో కామేశ్వరుడికి ఏకవార అభిషేకాలు నిర్వహించారు. పండితులు అఘోర పాశుపత హోమం జరిపించారు. రాత్రి మణిద్వీపం, కాళీ కాల భైరవుల సన్నిధిలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పీఠంలోని శివలింగానికి జల, క్షీరాభిషేకాలు జరిపారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. విశేష పూజా కార్యక్రమాల్లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ట్రస్టు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

➡ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో కాశీ విశ్వేశ్వరస్వామికి అర్చకులు ఏడిద గురునాథశర్మ, వి.ఎస్. కుమార్ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా జరిపారు. రాత్రి 8 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. కార్పొరేటర్ ఎ.అనిల్‌కుమార్‌రాజు, వెంకటరెడ్డి దంపతులు, ఆలయ ప్రెసిడెంట్ టి.ఎస్.ఎన్.మూర్తి, సెక్రటరీ ఎం.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి బి.కె.నాయుడు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

➡ సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన రామాలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


14వ వార్డు గణేష్‌నగర్ ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శివయ్యకు ప్రత్యేక పూజలు

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ రామాలయంలో కొలువైన శివయ్యకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ సెక్రటరీ వరప్రసాద్, కమిటీ సభ్యులు సన్మానించారు.

➡ 51వ వార్డు గాంధీనగర్ హరిహర క్షేత్రంలో పార్వతీ సమేత అమృత లింగేశ్వర(స్ఫటికలింగ) స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు నందీశ్వరుడికి పంచామృతాభిషేకాలు జరిపారు. రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. చివరిగా లింగోద్భవం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

➡ 53వ వార్డు మర్రిపాలెం పంజాబ్ హోటల్ హైవే దరి కాశీ విశ్వేశ్వరాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో తెల్లవారు 3 గంటల నుంచి ప్రధాన అర్చకుడు అందుకూరి శివాజీశర్మ ప్రథమ ఏకవారాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. రాత్రి 9 నుంచి 12 గంటల వరకు సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, లింగోద్భవ పూజ నిర్వహించామన్నారు.

ఘనంగా కల్యాణోత్సవాలు

కంచరపాలెం: కంచరపాలెం గౌరీశంకరాలయం, యల్లబిల్లివారి గౌరీ శంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, ఇందిరానగర్ లక్ష్మీగణపతి ఈశ్వరాలయం, ధర్మానగర్ బీవన్ టీవన్ కాలనీ హేరంబ కోదండ ఉమ మహేశ్వరాలయం, 104 ఏరియా బాపూజీనగర్ కోదండ రామలింగేశ్వరాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, అర్చనలు, రజత బిల్వార్చన, పూర్ణాహుతి, శతరుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉపవాసం ఉండి జాగరణ పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రైల్వే న్యూకాలనీ శాఖలో సర్వమత ప్రార్థనలు చేశారు. శాఖ ఇన్‌చార్జి శశికళ మాట్లాడుతూ శివరాత్రి ఉపవాస, జాగరణల విశిష్టతను తెలియజేశారు. మసీదు ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మనందరం ఒకే కుటుంబమని, మనలో బేధభావాలు లేకుండా కలిసికట్టుగా ఉండాలన్నారు. గురుద్వారా పూజారి జస్ట్ ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సద్గుణాలతో మెలగాలని, ఆర్చ్ డయాసిస్ ఫాదర్ జయరాజ్ మాట్లాడుతూ అందరం సహృదయంతో నడవాలని, తోటివారికి సహాయ పడాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ లైట్‌హౌస్, లైట్ షిప్స్ డైరెక్టర్ ముఖేష్ పార్మర్, బ్రహ్మకుమారీలు, మత పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో నూతన సామాజిక భవనాన్ని శుక్రవారం ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు.. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. నరసింహనగర్‌లో రూ.10.80 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, నాయకులు పైడి కృష్ణారావు మాస్టరు, అమర్ రెడ్డి, రాజాం రాజు, పైడి ప్రతాప్, బి.తిరుమల రావు, దమయంతి, లక్ష్మణరావు, ధర్మావతి, పొన్నాడ అప్పారావు మాస్టరు, నూకరాజు, ప్రసూనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వితరణ


వృద్ధులకు పండ్లు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మర్రిపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధ్వర్యంలో 49వ వార్డు వానప్రస్థ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ రోగికి మందుల నిమిత్తం కొంత నగదు అందజేశారు. క్లబ్ పూర్వ అధ్యక్షురాలు మాధవి, శిరీష, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, కోశాధికారి కమల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఆలయ ట్రస్టు సభ్యులకు అవమానం

- పట్టించుకోని శాఖ అధికారులు, అర్చకుడు

సీతమ్మధార: దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోని 24వ వార్డు నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ట్రస్టు సభ్యులకు అవమానం జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఆలయ ట్రస్టు సభ్యులు నక్క నాగమణి, సంతోషిభాయి స్వామిని దర్శించుకునేందుకు ఈ ఆలయానికి వెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ వ్యక్తి వీరిపై ఆగ్రహం వ్యక్తం చేసి బయటకు వెళ్లిపోవాలనడంతో సభ్యులు ఉమా నీలకంఠేశ్వరుడిని దర్శించుకోకుండానే వెనుదిరిగారు. అక్కడే ఉన్న అర్చకుడు చూసీచూడనట్లు వ్యవహరించడంతో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇటువంటి సంఘటనలు జరిగాయని, ఆలయ ట్రస్టు సభ్యులకే ఈ పరిస్థితి ఏర్పడితే.. భక్తుల సంగతి ఏంటని పలువురు వాపోయారు. దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు, ట్రస్టు సభ్యులు కోరుతున్నారు.

60 మందికి షోకాజ్ నోటీసులు


జీవీఎంసీ జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని కొన్ని వార్డు సచివాలయాల కార్యదర్శులకు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్య వైఖరి, విధులకు సకాలంలో హాజరు కాకపోవడంతో ఈమేరకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్సీ కృష్ణ మాట్లాడుతూ ఆసరా, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, పేదలందరికీ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను సంతృప్తికర పద్ధతిలో.. సమయ వ్యవధిలో ప్రజలకు అందజేయడంలో నిర్లక్ష్యం వహించిన 60 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వీరంతా వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

సీతంపేట: మహిళల్లో రాజకీయ చైతన్యం వస్తేనే సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదల ఉంటుందని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. దళితులు రాజకీయాల్లో ప్రవేశించాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం 'మహిళా సాధికారత – ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలంటే దళితులు, మహిళలు రాజకీయంగా ఎదగాలన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం రాజ్యాధికారం ఒక్కటేనని పేర్కొన్నారు. లా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధ మాట్లాడుతూ దళితులకు ఉన్నత విద్య గగనంగా మారిందన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రతరమవుతుందని, మళ్లీ వలసలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంఎస్ ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో అతివల పాత్ర అభినందనీయం


కేంద్రీయ విద్యాలయం సిబ్బందిని సత్కరిస్తున్న జేసీఐ వైజాగ్ ప్రతినిధులు


తాటిచెట్లపాలెం: పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆఫ్ వైజాగ్(జేసీఐ వైజాగ్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రను, ముఖ్యంగా ఉద్యోగాలు, పనులు చేసే మహిళలు ఇంటా, బయటా వారి కృషిని అభినందించారు. డాక్టర్ కొల్లూరి మాధూరి(ఆర్థోడాంటిస్ట్) మాట్లాడుతూ మహిళలు కుటుంబంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కేవీ ఉపాధ్యాయులు ఉదయం మహిళా సాధికారత, సమానత్వం గురించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పరిసర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జేసీఐ వైజాగ్ ప్రతినిధులు పలువురు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కేవీ వాల్తేర్‌ను అగ్రపథాన నిలిపి ఖేలో ఇండియాలో రిఫరీగా ఎంపికైన పీటీ కోచ్ గిరి, అవిశ్రాంత కృషితో 11వ తరగతిలో ఉత్తమ విద్యార్థినిగా నిలిచిన బాలికను, త్వరలో పదవీ విరమణ పొందనున్న భవాని, ఇందిరలతోపాటు 44 మంది సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో జేసీఐ వైజాగ్ ప్రతినిధులు ఛరిష్మా, కావ్య, గౌరి, కేవీ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వి.ఎం.శైలజ, ఇందిరా నాయర్, నాగమణి, వాణి, గీత, భవాని, ఇందిర, విజయలక్ష్మి, రేఖ మిట్టపల్లి తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


చీరలు అందుకున్న మహిళలతో వాకర్స్ క్లబ్ సభ్యులు

మర్రిపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో పది మంది మహిళలకు చీరలు అందజేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కూలి, ఇంటి పనులు చేసుకుంటూ జీవిస్తున్న మహిళలకు కార్యదర్శి పి.చెల్వారాజు ఆర్థిక సాయంతో చీరలు పంపిణీ చేశారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లోని 7వ నంబర్ ప్లాట్‌ఫాంపై శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. సుమారు 65 ఏళ్ల వయసున్న అతని ఎత్తు 5.5 అడుగులు, చామన చాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ రావు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లకు గానీ సమాచారమివ్వాలని ఎస్‌ఐ కోరారు.

సెలవు రోజున స్కూళ్ల నిర్వహణపై సీరియస్

విశాఖ విద్య: శివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించినా.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిర్వహించడాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించిన పాఠశాలల వివరాలను అందజేయాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం విద్యా శాఖాధికారులను ఆదేశించారు. పిల్లలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే శివరాత్రి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ.. కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు తరగతులు నిర్వహించినట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధారాలతో కమిషన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీన్ని సుమోటోగా స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధే జగన్ ప్రభుత్వ ధ్యేయం


వంశీనగర్‌లో ప్రధాన గెడ్డ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్


ఎంటీసీ పాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాస్

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 50, 44 వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

మర్రిపాలెం: అభివృద్ధే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం పలు పనుల నిర్మాణాలు పూర్తయిన వాటిని ప్రారంభించారు. మురళీనగర్ భాస్కర్ గార్డెన్స్‌లో రూ.18.76 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం, మాధవధారలో రూ.19.85 లక్షలతో ప్రధాన కాలువ రక్షణ గోడ నిర్మాణం, వంశీనగర్‌లో రూ.39.10 లక్షలతో ప్రధాన కాలువ రక్షణ గోడ, బాటం కాంక్రీట్ నిర్మాణానికి కొబ్బరికాయకొట్టి భూమిపూజ చేశారు. మురళీనగర్ హరిత పార్కులో రూ.18.90 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ విస్తరణ పనులను ప్రారంభించారు.

విష్ణుకుమార్‌రాజుపై కె.కె.రాజు ఫైర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఆయన సహకారంతో ఉత్తర నియోజకవర్గంలోనే రూ.435 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. గత ప్రభుత్వాలు నిర్మించిన భవనాలను సచివాలయాలకు వినియోగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అనడంపై ఆయన మండిపడ్డారు. అభివృద్ధి చేశామని నిరూపించడానికి ఎక్కడికి పిలిచినా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కె.కె.రాజు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే మతి భ్రమించి ఇటువంటివి మాట్లాడుతున్నారని విమర్శించారు. అభివృద్ధిపై ఇలాంటి మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేడాడ రమణికుమారి, భరణికాన రామారావు, బగాతి విజయ్, పి.సునీత, ఎం.లక్ష్మి, పైడి కృష్ణారావు మాస్టరు, అమర్‌రెడ్డి, ఎ.వి.ఎస్.రాజు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.61.8 లక్షలతో అభివృద్ధి పనులు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డులో రూ. 61.8 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. రూ.19.52 లక్షతో ఎంటీసీ పాలెంలోని శ్మశానవాటిక పునరుద్ధరణ, ఎంటీసీ పాలెం నుంచి ఏఎస్సార్ నగర్ వరకు రూ.42.28 లక్షలతో వరద నీటి కాలువ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఏఈ రవణమ్మ, వార్డు నాయకులు హబీబ్, సీతారాం, హీరా, సోఫియా, అక్తరి, బేగం, యాసిన్, గోపి, బషీర్, ప్రసాద్, మున్నీ, సన్యాసిరావు, ముస్తఫా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెంలో పరస మహోత్సవం

- ఘనంగా సుందర అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పరస ఉత్సవంలో మాట్లాడుతున్న కె.కె.రాజు. చిత్రంలో చొక్కాకుల వెంకటరావు, పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని సుందర అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద వార్షికోత్సవం, మహాశివరాత్రి, పరస వేడుకలు శుక్రవార ఘనంగా జరిగాయి. సాయంత్రం పరస సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావులు పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో వీరు పాల్గొన్నారు. రేలా రే రేలా, ఆటా–పాట వంటి కార్యక్రమాలతో పరస ఉత్సాహంగా ముగిసింది. 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, ఆలయ ధర్మకర్తలు నడిమింటి సీతారామరావు, రాపేటి గోవింద్, ఆలయ అధ్యక్షుడు ఆళ్ల మధుసూదన నరసింగరావు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నూతన 132 కేవీ హెచ్‌టీ టవర్ ఏర్పాటు, కండక్టర్ మార్పుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ముస్లిం తాటిచెట్లపాలెం, ఆంధ్రజ్యోతి కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ


కేక్ కట్ చేస్తున్న రోషిణి అపరంజి

విశాఖ సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపించగలరని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె కేక్ కట్‌చేసి మాట్లాడారు. విధుల్లో ప్రతిభ చూపిన మహిళలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీస్ శాఖ కుటుంబ సలహా నివేదిక', 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీసు శాఖ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకు నోటీసు' అనే పుస్తకాలను విడుదల చేశారు. సీపీ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజాగ్ సిటీ పోలీస్ మహిళా కో–ఆపరేటివ్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ప్రతిభ కనబరిచిన 26 మంది మహిళా పోలీసులకు సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ చందోలు, డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం, ప్రాసిక్యూషన్స్ డీడీ ఎం.శైలజ, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.